## క్లుప్తంగా

### భూసార పరీక్షలతో రైతులకు మేలు



పలిమెల: భూసార పరీక్షలు చేసుకోవడం ద్వారా పంటల దిగుబడి పెరిగి రైతులకు లాభం చేకూరుతుందని మండల వ్యవసాయాధికారి ముంజ మహేష్ అన్నారు. మండలంలోని లెంకలగడ్డ గ్రామంలో ఆస్పిరేషన్ బ్లాక్ ప్రోగ్రాం సంకల్ప సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కృషి మహోత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మహేష్ మాట్లాడుతూ.. వెస్ట్ డికంపోజ్ ఉపయోగాలు, నానో యూరియా, నానో డీఏపీ, భూసార పరీక్షల గురించి రైతులకు తెలిపారు. అలాగే పత్తి, మిరప పంటలను పరిశీలించి తెగుళ్ల సమస్యలు, వాటి సస్యరక్షణ చర్యలు గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ పృథ్వీరాజ్, ఏపీఓ సునీత, టీఏ ప్రశాంత్, రైతులు పాల్గొన్నారు.

### పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

చిట్యాల: మండలంలోని చల్లగరిగ గ్రామానికి చెందిన మేరుగు సంపత్‌కుమార్ తన సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రాక్ చేసి పట్టుకుని బాధితుడికి శుక్రవారం అందజేసినట్లు ఎస్సై జంగిలి రమేష్ తెలిపారు. పోలీస్ సిబ్బంది కోమల, సురేందర్, పాల్గొన్నారు.

### మండల అధ్యక్షుడిగా శివ

కాటారం: బీజేపీ యువ మోర్చా మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన బొడ్డు శివను నియమిస్తూ యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు గొర్రె శశిధర్ శుక్రవారం నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి కృషి చేసిన బీజేపీ జాతీయ కార్యదర్శి వివేక్‌వెంకటస్వామి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు యుగదీశ్వర్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పాగె రంజిత్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

### ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చిట్యాల: మండలంలోని కాల్వపల్లి మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్సై జంగిలి రమేష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రేగొండ మండలం మడతపల్లికి చెందిన సూర శాంతికుమార్ అనే వ్యక్తి అక్రమంగా ఇసుకను ట్రాక్టర్‌లో తరలిస్తుండగా గోపాలపూర్ వద్ద పోలీసులకు పట్టుపడ్డాడు. దీంతో అతడిని విచారించగా అతని వద్ద ఏలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో ఇసుక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

మంగపేట: మంగపేట మండలంలోని మల్లూరు వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మల్లూరు కేసీఆర్ కాలనీకి చెందిన మంచెర్ల లక్ష్మి మృతి చెందినట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం .. గురువారం రాత్రి 7గంటల ప్రాంతంలో లక్ష్మి కిరాణం షాపునకు వెళ్లి సరుకులు కొనుగోలు చేసి ఇంటికి తిరిగి వచ్చే క్రమంలో రోడ్డు దాటుతుండగా ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలైనట్లు తెలిపారు. చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా లక్ష్మి మృతిచెందిందని పేర్కొన్నారు. మృతుడి కుమారుడు మనేశ్వర్‌రావు ఫిర్యాదు మేరకు ద్విచక్రవాహనదారుడు సందీప్‌పై కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

# ప్రమాదకరంగా దుంగలు

- చెట్లు కూల్చి తొలగించని కాంట్రాక్టర్
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ఎస్‌ఎస్ తాడ్వాయి: మండల కేంద్రంలో జాతీయ రహదారి విస్తరణ కోసం రోడ్డు పక్కన ఉన్న చెట్లను కూల్చివేసిన సదరు కాంట్రాక్టర్ దుంగలను మాత్రం తొలగించకుండా రోడ్డుకు ఇరువైపుల అలాగే ఉంచారు. జాతీయ రహదారిపై నిత్యం వేలాది రాకపోకలు సాగుతుంటాయి. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ రహదారి పక్కన, కెనరా బ్యాంక్ రోడ్డు పక్కన దుంగలను రోడ్డు అంచున వదిలేశారు. రోడ్డు పక్కన పాదాచారులు వెళ్తున్న క్రమంలో ఎదురుగా వచ్చే వాహనాల చూసి రోడ్డు దిగేందుకు ప్రయతిస్తే దుంగలను అడ్డుగా ఉంటడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. నాలుగు రోజుల క్రితం మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి గ్రామ పంచాయతీ వద్ద రోడ్డు పక్కనుంచి నడుచుకుంటూ వస్తున్న క్రమంలో ఓ కారు అతని రెండు కాళ్ల పై నుంచి వెళ్లింది. ఆ సంఘటన స్థలం వద్ద దుంగలు రోడ్డుపై అడ్డుగా ఉండటంతో రోడ్డు దిగలేని పరిస్థితిలో ఈ ఘటన చోటుచేసుకుందని బాధిత వ్యక్తి వాపోయాడు. రాత్రి సమయంలో రోడ్డు పక్కన దుంగలు ఉన్న విషయం తెలియక వాహనదారులకు ప్రమాదం జరిగే అస్కారం ఉంది. మండల అధికారులు స్పందించి రోడ్డు పక్కన ఉన్న దుంగలు తొలగించాలని వాహనదారులు, గ్రామస్తులు కోరుతున్నారు.



రోడ్డు పక్కన ఉన్న దుంగలు

## ఆశవర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

ఏటూరునాగారం: ఆశవర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావూద్ అన్నారు. తమ డిమాండ్లు నెరవేర్చాలని శుక్రవారం మండల కేంద్రంలో ఆశవర్కర్లు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా దావూద్ మాట్లాడుతూ.. ఆశ వర్కర్లు 12 రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ సీఎం కేసీఆర్ ఎందుకు స్పందించడం లేదో తెలుపాలన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా వారిపై ఎలాంటి కనికరం చూపడం లేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే పలుమార్లు ఏటూరునాగారాన్ని సందర్శించి కూడా ఆశల సమస్యలపై స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో ఆశవర్కర్లు సరిత, వనజ, రాణి, భవాని, భాగ్యలక్ష్మి, సుమలత, స్వరూప, అరుణ తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ మండల కేంద్రంలో ఆశవర్కర్లు శుక్రవారం ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆశవర్కర్ల మండల అధ్యక్షురాలు కుంచాల రాధిక మాట్లాడుతూ.. 12 రోజులగా సమ్మె చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పట్టించకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాటిపెల్లి సాయివేద, సుమంత, లక్ష్మీ, లావణ్య పాల్గొన్నారు.

కాటారం: తమ డిమాండ్లను నెరావేర్చాలని ఆశ కార్యకర్తలు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో జాతీయ రహదారిపై శుక్రవారం ఆశకార్యకర్తలు రాస్తారోకో చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆశకార్యకర్తలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు.



ఏటూరునాగారం: సమ్మె చేస్తున్న ఆశవర్కర్లు

## ఓటును సద్వినియోగం చేసుకోవాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కళాకారులు

ఎస్‌ఎస్ తాడ్వాయి: స్వచ్ఛందంగా ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని మండల కేంద్రంలోని కామారం గ్రామ పంచాయతీలో కళాకారులు శుక్రవారం కళాజాతా నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తెలంగాణ సాంస్కృతిక సారథి రాగుల శంకర్ బృందం ఓటు హక్కు, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు రవి, బుచ్చన్న, సాగర్, రహీముద్దీన్, రాజేందర్, రేల విజయ్, అమ్మపాట తిరుపతి, కుమార్, సురేష్, నరేష్, శోభ, శ్రీలతతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్‌లో చేరిన ఎంపీటీసీ

ఎస్‌ఎస్ తాడ్వాయి: మండలంలోని నర్సాపూర్ ఎంపీటీసీ నాలి సుమలత బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ నాగజ్యోతి ఆధ్వర్యంలో పార్టీలో చేరగా కండువా కప్పి అహ్వానించారు. కొద్ది నెలల క్రితం సుమలత బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరగా తిరిగి శుక్రవారం సొంత గూటికి చేరింది. ఈ సందర్భంగా నాగజ్యోతి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ సారథ్యంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని నాయకులు విశ్వాసంతో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్ కో చైర్మన్ సతీష్, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు బంగారు సాంబయ్య, చల్ల రజినీకర్‌రెడ్డి పాల్గొన్నారు.



పార్టీలో చేరిన ఎంపీటీసీ సుమలత

## గుడుంబా స్థావరాలపై దాడులు

మహాముత్తారం: మండలంలోని పెగడపల్లి గ్రామంలో శుక్రవారం మహాముత్తారం ఎస్సై సుధాకర్, కాటారం ఎక్సైజ్ సీఐ ప్రశాంతి సంయుక్తంగా గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 2వేల 5వందల లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి 50లీటర్ల గుడుంబాను సీజ్ చేశారు.

టేకుమట్ల: గుడుంబాను విక్రయిస్తున్న ఇద్దరు మహిళలను శుక్రవారం సాయంత్రం పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై గట్ల సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా వివరాలను వెల్లడించారు. మండలంలోని గర్మిళ్లపల్లిలో అక్రమంగా గుడుంబాను విక్రయిస్తున్నారనే సమాచారంతో తనిఖీలు చేపట్టగా బుదారపు రాజేశ్వరీ, బూతుర్కారి సమ్మక్క ఇళ్లల్లో లభించిన 10 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని వారిని శుక్రవారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు

చిట్యాల: మండలంలోని పాశిగడ్డతండాకు చెందిన గుగులోతు సమ్మయ్య అనే వ్యక్తి 20 లీటర్ల గుడంబాను తరలిస్తుండగా శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్సై జంగిలి రమేష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం ఇలా ఉన్నాయి. పాశిగడ్డతండా గ్రామంలో పోలీసులు ఏరియా పెట్రోలింగ్ చేస్తుండగా సమ్మయ్య అక్కడి నుండి పారిపోయే ప్రయత్నం చేస్తున్నాడని అతనిని పట్టుకోగా గుడుంబా సంచీ ఉందని తెలిపారు. ఈ మేరకు గుడుంబాను స్వాధీనం చేసుకుని అతడినిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది సిద్దార్థ, ప్రశాంత్, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.



మహాముత్తారం: పానకం పారబోస్తున్న పోలీసులు

కాటారం: మండలంలోని కొత్తపల్లిలోని ఓ ఇంట్లో నిల్వ చేసి విక్రయిస్తున్న గుడుంబాను శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై2 సురేశ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం అక్రమంగా గుడుంబా విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. 14 లీటర్ల గుడుంబా స్వాధీనపర్చుకొని లక్ష్మి అనే మహిళపై కేసు నమోదు చేసినట్లు వెల్లడిచారు.

# బీఆర్‌ఎస్‌తోనే ప్రజలకు సమన్యాయం

ఏటూరునాగారం: నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరగాలంటే బీఆర్‌ఎస్ పార్టీ గెలిస్తేనే సాధ్యం అవుతుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మండలాల బూత్ లెవల్, వంద ఓట్లు ఇన్‌చార్జ్‌లు, గ్రామ కమిటీల అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ జెండాను ఎగురవేయడమే లక్ష్యం అన్నారు. గృహలక్ష్మి పథకం కింద ఇచ్చిన మూడు వేల ఇళ్లు కాకుండా ఇటీవల ఆర్థిక శాఖ మంత్రి హరీష్‌రావు పర్యటనలో మన జిల్లాకు అదనంగా రెండు వేలు ఇస్తానని హామీ ఇచ్చారన్నారు. అదేవిధంగా దళిత బంధు కూడా అన్ని వర్గాల పేద వారికి ఇస్తామని తెలిపారు. ప్రతిపక్ష ఎమ్మెల్యే నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి ఏమిటో చూపాలన్నారు. సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి పనులే మనకు కళ్లకు కనిపిస్తున్నాయని, ఆ పథకాలను చూసి జెడ్పీచైర్‌పర్సన్, ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతికి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను వేడుకున్నారు.



మాట్లాడుతున్న లక్ష్మీనర్సింహారావు

**నాయకులు, కార్యకర్తలే నా బలం**

బీఆర్‌ఎస్ పార్టీలోని నాయకులు, కార్యకర్తలే తన బలమని, పేద వర్గానికి చెందిన తనను ఆశీర్వదించి అసెంబ్లీకి పంపించాలని బడే నాగజ్యోతి మహిళలను, కార్యకర్తలు, నాయకులను కోరారు. డబ్బు సంచులతోని ఎవరు రాలేదని, కేవలం అభివృద్ధి పనులు, పథకాలతోనే ప్రజల్లోకి వెళ్తున్నట్లు వివరించారు. బూత్ లెవల్, వంద ఓట్లకు ఏర్పాటు చేసిన ఇన్‌చార్జ్‌లు సమన్వయంతో పనిచేయాలని మూడు మండలాల ఇన్‌చార్జ్, రోడ్లు, భవనాల కార్పొరేషన్ చైర్మన్ మెట్టు శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అంతటి విజయ, జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ, మండల పార్టీ అధ్యక్షుడు సునీల్ కుమార్, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు పల్లా బుచ్చయ్య, నాయకులు సర్దార్, మల్లారెడ్డి, ఖాజాపాషా, కూనూరు మహేష్, ప్రదీప్‌రావు, కోనేరు నగేష్, సలీం, ఫత్తె మహ్మద్, రాంబాబు, కాళ్ల రామకృష్ణ, మహిళలు పాల్గొన్నారు.

### కుట్టు మిషన్ల పంపిణీ



కుట్టుమిషన్లు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

ఏటూరునాగారం: మండలంలోని 18 మంది ముస్లిం మహిళలకు కేసీఆర్ కా తోఫా పథకంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో కుట్టు మిషన్లను ఎంపీపీ అంతటి విజయ, జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తుమ్మ సంజీవరెడ్డి, ఎంపీటీసీ గుడ్ల శ్రీలత, శంకరాజుపల్లి ఎంపీటీసీ జాడి లక్ష్మీనారాయణ, మైనార్టీ సంక్షేమ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ రేణుక, ఎంపీడీఓ కుమార్, సూపరింటెండెంట్ ఉమారాణి, టైపిస్ట్ భిక్షపతితో పాటు తదితరులు పాల్గొన్నారు.

## అధికార పార్టీ నాయకులకే పథకాలు

ఏటూరునాగారం: రాష్ట్ర ప్రభుత్వం అందించే ప్రభుత్వ పథకాలు కేవలం బీఆర్‌ఎస్ నాయకులకే వస్తున్నాయని బీజేపీ మండల అధ్యక్షుడు గండెపల్లి సత్యం ఆరోపించారు. శుక్రవారం మండలం కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితబంధు పేద దళితులకు రాకుండా చేసి బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలకు మాత్రమే ఇచ్చారన్నారు. గృహలక్ష్మి పథకం ఇళ్లు లేని నిరుపేదలకు ఇవ్వకుండా బీఆర్‌ఎస్ నాయకులకే ఇచ్చారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు దళితబంధు పథకం ఇప్పిస్తామని ఒక్కొక్కరి వద్ద నుంచి మూడు లక్షల రూపాయలు వసూలు చేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు వావిలాల జనార్ధన్, మండల ప్రధాన కార్యదర్శి గాడిచెర్ల రాజశేఖర్, యువ మోర్చా మండల అధ్యక్షులు వినుకోలు చక్రవర్తి కిషన్, మోర్చా మండల అధ్యక్షుడు కందడి ఎలేందర్, సాయి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

### వాహనాల తనిఖీ



కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

వాజేడు: మండల పరిధిలో జగన్నాథపురం జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై వాజేడు ఎస్సై వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో సివిల్, సీఆర్పీఎఫ్ పోలీసులు శుక్రవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. రహదారిపై వచ్చి వెళ్లే ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయడంతో పాటు అందులోని బ్యాగులను సోదాలు చేశారు.

## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ఏటూరునాగారం: మండల కేంద్రానికి చెందిన రాందాసు కుమారుడు డెంగీతో బాధపడుతూ హైదరాబాద్ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తూ చికిత్స పొందుతున్నాడు. అయితే నాగరాజు నిరుపేద కుటుంబానికి చెందిన వాడు కావడంతో స్థానిక చైతన్య యువజన సంఘం సభ్యుల ఆధ్వర్యంలో దాతల సాయంతో రూ.34వేలు నగదును సేకరించి బాధిత కుటుంబానికి శుక్రవారం హైదరాబాద్‌లో అందజేశారు. ఈ కార్యక్రమంలో నవీన్, గుంత రమేష్, కత్తెర శ్రీనివాస్, పిట్టల శ్రీనివాస్, పిట్టల శివ, దీనబాందు స్వామి, అజహర్ తదితరులు పాల్గొన్నారు.

**ముప్పనపల్లి సహాయ నిధి ఆధ్వర్యంలో..**

కన్నాయిగూడెం: మండలంలోని ముప్పనపల్లి సహాయ నిధి ఆధ్వర్యంలో రాందాసు నాగరాజు కుమారుడి చికిత్స కోసం రూ.20వేలు దాతల సహకారంతో సేకరించి శుక్రవారం వారికి హైదరాబాద్‌లో అప్పగించారు. ఈ కార్యక్రమంలో సహాయ నిధి అధ్యక్షుడు అబ్బు సతీష్, బుద్దె నరేందర్, తొంగళి నవీన్, అచ్చ హరీష్ పాల్గొన్నారు.



ఏటూరునాగారం: సాయం అందజేస్తున్న చైతన్య యువజన సంఘం సభ్యులు

### దరఖాస్తుల ఆహ్వానం

వాజేడు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్లకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ శేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 8 వరకు అవకాశం ఉందని ఆన్‌లైన్‌లో దరఖాస్తులను చేసుకుని 9, 10 తేదీల్లో నేరుగా కళాశాలకు రావాలన్నారు. దరఖాస్తులు పరిశీలించిన అనంతరం సీట్లు కేటాయించనున్నట్లు తెలిపారు.

## మావోయిస్టులకు ఆశ్రయం ఇవ్వొద్దు

పలిమెల: గ్రామాల్లో మావోయిస్టులకు ఆశ్రయం కల్పించొద్దని ఎస్సై తమాషారెడ్డి పేర్కొన్నారు. కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్‌లో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని గొత్తికోయగూడెంను ఎస్సై సందర్శించి మాట్లాడారు. మావోయిస్టులకు ఎలాంటి సహాయం చేయొద్దని హెచ్చరించారు. గ్రామంలోకి ఎవరైనా కొత్త వ్యక్తులు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. మహిళల రక్షణ, వారిపై జరిగే నేరాల గురించి, షీ టీమ్ ప్రాముఖ్యత గురించి వివరించారు. గూడెంలో చాలా మంది సీజనల్ వ్యాధులతో బాధపడుతున్నారని తెలుసుకొని వెంటనే మండల మెడికల్ ఆఫీసర్‌కు ఫోన్ చేసి సంబంధిత ఏఎన్‌ఎంను పిలిపించి గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేయించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సివిల్, టీఎస్‌ఎస్పీ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్సై తమాషారెడ్డి

# లక్ష్యసాధనకు అడుగులు పడాలి



భూపాలపల్లి అర్బన్: ఐడీ కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే గండ్ర, కలెక్టర్



గోరికొత్తపల్లిలో భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

భూపాలపల్లి అర్బన్: విద్యార్థి దశ నుంచే ఒక లక్ష్యాన్ని ఎంచుకొని లక్ష్య సాధనకు ప్రతి విద్యార్థి కష్టపడాలని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల లక్ష్యాలను గుర్తించి ప్రత్యేక ఐడీ కార్డులను కలెక్టర్, ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిలు ప్రత్యేక చొరవ తీసుకొని తయారు చేశారు. ఈ కార్డుపై విద్యార్థి పేరు, ఎంచుకున్న లక్ష్యాన్ని ముద్రించారు. జిల్లా కేంద్రంలోని జంగేడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులకు లక్ష్యాలను గుర్తు చేస్తూ వారిని సరైన మార్గంలో నడపడంలో ఈ వినూత్న కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రయోగాత్మకంగా ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల భవిష్యత్‌లో ఏ రంగంలో ఎదగాలనుకుంటున్నారో వారి లక్ష్యాలను తెలుసుకొని, దానికి అనుగుణంగా గుర్తింపు కార్డులు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరాణి సిద్దు, మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మీనర్సింగరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రమేష్, డీఈఓ రాంకుమార్ పాల్గొన్నారు.

**నూతన మండలాలతో పాలన సులభం**

టేకుమట్ల(గోరికొత్తపల్లి): నూతన మండలాలతో పాలన సులభతరమైందని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం గోరికొత్తపల్లి నూతన మండలంలో తహసీల్దార్, మండల పరిషత్ భవన నిర్మానానికి రూ.1కోటి, 40లక్షల నిధులతో కలెక్టర్ భవేష్‌మిశ్రాతో కలిసి శంకుస్థాపన చేవారు. అలాగే జగ్గయ్యపేట ఉన్నత పాఠశాలలో మన ఊరు–మనబడి కార్యక్రమంలో అదనపు గదులు, డిజిటల్ తరగతులను ప్రారంభించారు. అలాగే గ్రామంలో రూ.50లక్షలతో సైడు కాలువల నిర్మానానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోనే అతి పెద్ద మండలమైన రేగొండలో గోరికొత్తపల్లిని మరో మండలంగా ఏర్పాటు చేయడంతో పాలన సులభతరంతో పాటు, మండల ప్రజలకు పాలన సౌకర్యవంతంగా ఉంటుందని అన్నారు. అలాగే కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ.. మండలంలోని భూసమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని అన్నారు. అనంతరం మహిళలకు బతుకమ్మ చీరలు, యువకులకు కేసీఆర్ కిట్‌లను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పున్నం లక్ష్మీరవి, జెడ్పీటీసీ సాయిని విజయ, రేగొండ, గోరికొత్తపల్లి తహసీల్దార్లు సత్యనారాయణస్వామి, రవికుమార్, ఎంపీడీఓ సురేందర్, సర్పంచ్ సూదబోయిన రజిత, ఎంపీటీసీ హమీద్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాజేందర్,మటిక సంతోష్ ఉన్నారు.

### జాగ్రత్తగా వ్యవహరించాలి

కాటారం: విద్యార్థులపై జాగ్రత్తగా వ్యవహరించి వారికి ఎలాంటి లోటుపాట్లు కల్గకుండా చూసుకోవాలని ఎంపీడీఓ శంకర్‌నాయక్ సూచించారు. కాటారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలను కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం ఎంపీడీఓ తనిఖీ చేశారు. విద్యార్థుల, ఉపాధ్యాయినీల హాజరు పట్టికను పరిశీలించారు. స్టోర్ రూం, వంటగది, తరగతి గదులను కలియ తిరిగి సమస్యలపై ఆరా తీశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం, విద్యాబోధన, వైద్య సేవలపై విద్యార్థులతో చర్చించారు. ఎంపీడీఓ వెంట ఉపాధ్యాయినులు నళిని, లక్ష్మి, టీ.ఏ శ్రీనివాస్ ఉన్నారు.



వంట గదిని పరిశీలిస్తున్న ఎంపీడీఓ